Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 | సంచిక : 94 | హైదరాబాద్ | ఆదివారం | 17 -12 - 2023 | పేజీలు : 8 | రూ.4




## కేసీఆర్‌కు పదవులిచ్చిందే

## కాంగ్రెస్: సీఎం రేవంత్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** అసెంబ్లీలో సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కేసీఆర్ కు పదవి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈ మేరకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అసెంబ్లీలో వాడీవేడీ చర్చ జరిగింది. శనివారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పేరును ప్రకటించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదించగా, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బలపరిచారు.అనంతరం భరత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగం తప్పుల తడకగా ఉందని, వాస్తవాలకు దూరంగా ఉందన్నారు. ఆయన మాట్లాడుతుండగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డంకి కొట్టారు. 2014కు ముందు అన్యాయం జరిగిందని, తెలంగాణ కోసం పోరాడామన్నారు. ప్రసంగం ప్రారంభించినంత మాత్రాన కేటీఆర్ దాడి చేస్తున్నట్టు మాట్లాడడం సరికాదన్నారు. నిర్మాణాత్మక సూచనలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన చరిత్ర భారత దేశానిదని, ఆర్‌డబ్ల్యూఎస్ నిర్మించిన వ్యవస్థలు, సంస్థలను ధ్వంసం చేశారని.. తెలంగాణను రూ.5 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని భట్టి అన్నారు.

- వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బొమ్మరాస్పేట గ్రామా పంచాయతి కార్యాలయము దగ్గర జెండా ఊపి వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిన గవర్నర్, అధికారులు



## కేంద్ర పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు

**తెలంగాణ వీణ/శామీర్‌పేట:** కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, ప్రతి ఒక్కరిలోనూ ఆనందం కనిపిస్తోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట గ్రామా పంచాయతీ కార్యాలయము దగ్గర భారత ప్రభుత్వం చేపటిన పథకాల గురించి వికసిత్ భారత్ సంకల్పయాత్రను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ నమస్కారాలు తెలియజేశారు. తాను ఈ రోజు ఇక్కడకు రావడం అందరినీ కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మీరందరూ సంతోషంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రస్తుతం భాతరదేశం ప్రతి రంగంలోనూ అన్ని దేశాల్లో కంటే ముందుందని, ప్రపంచ దేశాలకు

వివరాలు 2లో

## అసెంబ్లీలో ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు...



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** అసెంబ్లీలో ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ తమిళిసై ప్రసంగం తప్పుల తడకగా ఉందన్నారు. సభ్యునిగా ఇందుకు సిగ్గుపడుతున్నానని అన్నారు. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన వారిపై సాకులు చెబుతున్నారని విమర్శించారు. దీన్ని ఆయన ఖండించారు.గవర్నర్ ప్రసంగంలో ఒక్క వాస్తవం కూడా లేదన్నారు. ఎప్పుడూ ప్రజల పక్షమే...తెలంగాణ పార్టీ కూడా.. కాంగ్రెస్ ఎప్పుడూ ప్రతిపక్షమేనని అన్నారు. కేటీఆర్ ప్రసంగాన్ని కాంగ్రెస్ పార్టీ సభ్యులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ పాలన పటారం లోటారంలా ఉందని మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మాజీ సీఎం కేసీఆర్ భద్రత కుదింపు..

### - సెక్యూరిటీ సిబ్బంది ఎంతమందంటే..!



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్ భద్రతను కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జడ్ కేటగిరి నుంచి ఆయన భద్రతను వై ప్లస్‌కు తగ్గించారు. ఇక నుంచి 1o4 చొప్పున రెండు షిఫ్టుల్లో కలిపి 2o8 మంది కేసీఆర్ భద్రతా సిబ్బందిగా ఉండనున్నారు. కేసీఆర్ నివాసం వద్ద నిరంతరం గార్డుల కాపలా ఉంటుంది. ఆయన ఇంటి పరిసరాల్లోనూ మఫ్టీలో సిబ్బంది ఉంటారు. ఇక కేసీఆర్ బయటికి వెళ్లినప్పుడు పైలట్ ఎస్కార్ట్ భద్రత యథావిధిగా కొనసాగతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. చట్టసభల ప్రతినిధులు మాజీలుగా మారిన అనంతరం భద్రతను కుదించే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.సాధారణంగా ముఖ్యమంత్రిగా ఎన్నికైన వారికి జడ్ కేటగిరి భద్రతను కల్పిస్తారు. జెడ్ కేటగిరిలో ఆరుగురు గన్‌మెన్‌లు, ఇంటి వద్ద కాపలాలకు మరో ఇద్దరిని ( ప్లస్ 8) పెడతారు. ఇలా రెండు షిఫ్టుల్లో 4o12 భద్రతగా ఉంటారు. తాజా మాజీ ముఖ్యమంత్రికి వై ప్లస్‌కు తగ్గిస్తారు. అదే సమయంలో వీరిద్దరి కంటే ముందు ముఖ్యమంత్రిగా చేసిన వారి భద్రత వై కేటగిరీకి తగ్గుతుంది. అందులో భాగంగా కేసీఆర్ కంటే ముందు ముఖ్యమంత్రిగా ఉన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇప్పటివరకు ఉన్న వై ప్లస్ భద్రతను వై కేటగిరీకి కుదించారు. వై కేటగిరి కింద ఒక గన్‌మెన్, స్టాటిక్ సెక్యూరిటీ కోసం ఒకరు (ప్లస్ ఫోర్ రొటేషన్‌లో) ఉంటారు. మావోయిస్టులతో ముప్పు పొంచి ఉండటం లాంటి ప్రత్యేక సందర్భాల్లో భద్రతను యథావిధిగా కొనసాగించే అవకాశముంది.ఇక మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు సెక్యూరిటీని తొలగిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు పోలీస్ శాఖకు రేవంత్ రెడ్డి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యేలు, మంత్రుల వద్ద ఉన్న గన్‌మెన్‌లను పోలీస్ శాఖ వెనక్కి పిలిపించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు పోలీస్ శాఖ గన్‌మెన్ లను కేటాయించింది. ఇక మాజీ మంత్రులు, ఎమ్మెల్యే ల్లో ఎవరెవరికి గన్‌మెన్స్ అవసరమనే దానిపై ఇంటెలిజెన్స్ అధికారులు సమీక్షించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ విభాగం ఒక నివేదిక సమర్పించనుంది. అనంతరం భద్రతా కారణాలను దృష్ట్యా వారికి సెక్యూరిటీ అవసరమా.. కాదా.. అనే విషయాన్ని తేల్చనున్నారు. భద్రత అవసరం అని భావించిన వారికి మళ్లీ గన్‌మెన్‌లను కేటాయించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## పౌరసరఫరాలశాఖ రూ.56 వేల కోట్ల అప్పుల్లో ఉంది: మంత్రి ఉత్తమ్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పౌరసరఫరాల శాఖ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాఖ రూ.56 వేల కోట్ల అప్పుల్లో ఉందని వెల్లడించారు. గత పాలకుల వల్ల పౌరసరఫరాల శాఖలో అనేక తప్పిదాలు జరిగాయని ఆరోపించారు. 12 శాతం మంది రేషన్ బియ్యం తీసుకోవడం లేదని చెప్పారు. పేదలకు నాణ్య మైన రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పౌరసర ఫరాల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ.. యాసంగిలో వానాకాలం ధాన్యం ఉత్పత్తిపై అధికారులతో ఉత్తమ్ చర్చించారన్నారు. బియ్యం మిల్లింగ్ సామర్థ్యం, నాణ్యతపై అధికారులు వివరించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీసినట్లు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారని ఉత్తమ్ ఆరోపించారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మిల్లర్ల సమస్యలపై అధికారులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు. 100 రోజుల్లో గ్యాస్ సిలిండర్ హామీని అమలు చేస్తానని హామీ ఇచ్చారు.

## ఎన్నికల సన్నద్ధతపై గుజరాత్ నేతలతో రాహుల్, ఖర్గే బేటీ....

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ సన్నద్ధతకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనాయకత్వం శనివారం నాడిక్కడ సమావేశమై చర్చలు జరిపింది. పార్టీని బలోపేతం చేసేందుకు తాము సానుకూల అజెండాతో ముందుకు వెళతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. ఇక్కడి ఏఐసిసి ప్రధాన కార్యాలయంలో గుజరాత్ కాంగ్రెస్ నాయకులతో ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోపాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సవాళ్లను, బిజెపి దుష్పరిపాలనను ప్రజలకు వివరించడానికి తీసుకోవలసిన చర్యలను ఈ సమావేశంలో చర్చించారు. అన్ని రాష్ట్రాలలో పార్టీని బలోపేతం చేయడతోపాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీని సన్నద్ధం చేయడం కోసం కాంగ్రెస్ అగ్రనాయకత్వం నిర్వహిస్తున్న సమావేశాల పరంపరలో భాగంగాశనివారం గుజరాత్ కాంగ్రెస్ నాయకులతో ఈ సమావేశం జరిగింది.గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వ నిరాటంక దుష్పరిపాలన కారనంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు, దళితులు, గిరిజనుల అత్యాచారాలు, అవినీతి, మోసాలు కొనసాగున్నాయని సమావేశం అనతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఖర్గే ట్వీట్




చేశారు. ఈ సమావేశంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్, గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శక్తిసింహ్ గోహిల్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబ సభ్యుల పాస్‌పోర్టులు సీజ్‌కు బండి డిమాండ్



**తెలంగాణ వీణ/కరీంనగర్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యుల పాస్ పోర్టులు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు బిజెపి ఎంపి బండి సంజయ్ . బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, . లేకపోతే అందరూ దేశం దాటి పారిపోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు.. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై కొత్త ప్రభుత్వం విచారణ జరపాలని కోరారు. కాగా , ఈ నెలాఖరులో 20 వేల మంది బీజేపీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం కూడా నిర్వహిస్తామని తెలిపారు.

## కేంద్ర పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. అన్ని రంగాల ప్రజలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ప్రస్తుతం ఎవరికైనా ఆరోగ్యం బాగాలేనట్లయితే వారికి సంబంధించి మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఆయుష్మాన్ భారత్ ఉందని, ఈ స్కీమ్ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్యసేవలను పొందవచ్చని వివరించారు. ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతాయని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా పొగలేని గ్యాస్టవ్ ఇవ్వడం జరిగిందనన్నారు. అనేక మంది గ్రామీణ ప్రజలకు పీఎం ఆవాస్ యోజన ద్వారా అందరికీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా అనేక మంది వ్యాపారులు యజమానులు అయ్యారన్నారు. ప్రధాన మంత్రి రైతుబీమా ద్వారా అనేక మంది ప్రయోజనం పొందారన్నారని, ఈ విధంగా అనేక కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంకల్పం (ప్రతిజ్ఞ) చేశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ క్యాలెండర్, బ్రోచర్ను ఆవిష్కరించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ శాంతమను, జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ప్రసంగంలోని అనుచిత వ్యాఖ్యలను రికార్డుల్లో నుంచి తొలగించాలి



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** గవర్నర్ ప్రసంగంలోని పలు అంశాలపై ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతరకరమైన వ్యాఖ్యలను రికార్డుల్లో నుంచి తొలగించాలని ప్రతిపాదించారు. 'విముక్తి', 'అణచివేత', 'నియంతృత్వ పాలన', 'వ్యవస్థల విధ్వంసం', 'వివక్ష' వంటి పదాలను గవర్నర్ ప్రసంగం నుంచి తొలగించాలని కోరారు. గవర్నర్ ప్రసంగంలోని అనుచిత వ్యాఖ్యలను రికార్డుల్లో నుంచి తొలగించాలని కవిత ప్రతిపాదించారు.

## ప్రజాభవన్‌లో భట్టి విందుకు సిఎం రేవంత్ రెడ్డి హాజరు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు ప్రజాభవన్‌లో ఇచ్చిన విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. రాజ్యసభ సభ్యులు జయరాం రమేష్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి రవి గుప్తా, ప్రభుత్వ విప్ ఐలయ్య, శ్రీనివాస్, ఎంఎల్ఎ లు, పలువురు ఐఎఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీసు నియామకాలు పారదర్శకంగా నిర్వహించాలి

### - సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పోలీసు నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోలీసు, వైద్యారోగ్య శాఖల్లో నియామకాలపై శుక్రవారం (డిసెంబర్ 15న) సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగ నియామకాలను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. నియామకాల ప్రక్రియలో ఉన్న లోటు పాట్లు, వాటిని అధిగమించే అంశాలపై సవివరమైన నివేదిక ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఉద్యోగ నియామకాలపై కూడా నివేదిక ఇవ్వాలని అడిగారు. సాధ్యమైనంత త్వరగా పోలీసు ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు కోరుకొండ స్కూల్ మాదిరిగా ఉత్తర, దక్షిణ తెలంగాణల్లో రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూడా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఎనిమిదేళ్లుగా హోంగార్డు నియామకాలు లేవని పేర్కొన్న ముఖ్యమంత్రి, వెంటనే నియామకాలు చేపట్టాలని కూడా ఆదేశించారు. హోం గార్డు సేవలు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వినియోగించాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యోగానికి రాజీనామా చేసిన డీఎస్పీ నళినికి పోలీసు శాఖలో అదే ఉద్యోగాన్ని ఇవ్వడానికి ఇబ్బంది ఏంటని సీఎం రేవంత్ అధికారులను ప్రశ్నించారు. ఆమెకు ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉంటే వెంటనే ఉద్యోగంలోకి తీసుకోవాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. పోలీసు శాఖలో మార్గదర్శకాలకు సంబంధించి ఇబ్బందులేమైనా ఉంటే అదే హోదాలో మరో శాఖలో ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా.. చాలా మంది తిరిగి ఉద్యోగాల్లో చేరిన విషయాన్ని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇదే నియమం పవిత్రమైన



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉన్నత ఉద్యోగాన్ని త్యజించిన నళినికి తిరిగి ఉద్యోగం ఇవ్వడంలో ఎందుకు వర్తింపజేయకూడదని ప్రశ్నించారు.

# తెలంగాణలో ఫ్రాన్స్ సంస్థ పెట్టుబడులు..

### - ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఇండియన్ ఆర్మీకి అధునాతన పరికరాలను (గింబాల్స్) అందించే ఉత్పత్తి కేంద్రాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పడానికి ఫ్రాన్స్ సంస్థ మెరియో ముందుకొచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న హెచ్‌సీ రోబోటిక్స్ భాగస్వామ్యంతో ఈ సంస్థ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలతో మెరియో సీఈవో రెమి ప్లెనిట్, హెచ్‌సీ రోబోటిక్స్ సీఈవో వెంకట్ చుండి, డైరెక్టర్ రాధాకిషోర్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం (డిసెంబర్ 15న) సెక్రటేరియట్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఇప్పటికే ఈ సంస్థ ప్రతినిధుల బృందం ఇండియన్ ఆర్మీలోని పలువురు ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఆ వివరాలను మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనున్న ఉత్పత్తి కేంద్రంపై తమ ప్రణాళికలను శ్రీధర్ బాబుకు వివరించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలను అందిస్తామని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.అనంతరం తెలంగాణలో ఐటీ విభాగం పనితీరుపై ఆ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో కలిసి ఫొటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో మాధవ్, వీహబ్ సీఈవో దీప్తిరావుల, ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ లంకా రమాదేవి, టీహబ్ సీఈవో



శ్రీనివాస్, టీఎస్ఐసీ సీఈవో శాంత, ఐటీశాఖ సీఆర్‌వో అమర్‌నాథ్‌రెడ్డిలతో మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఐటీలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల యువతకు మరిన్ని అవకాశాలు లభించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. అంకురాల్లో తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అంకురాలకు నిధులు రాబట్టడంలో కర్ణాటక కంటే మెరుగ్గా ఉండాలని సూచించారు.

# తెలంగాణ ఉద్యోగులకు త్వరలో పాత పెన్షన్...

### - అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనపై ఉద్యోగ సంఘాల ప్రత్యేక ధన్యవాదాలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** అసెంబ్లీలో పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరణ కు కట్టుబడి ఉందని ప్రకటన చేయడంపై రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ,రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి ఈడిగి నరేష్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల భావి జీవితానికి భరోసానిస్తూ వారికి సామాజిక భద్రతను కల్గించడం తమ బాధ్యతగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పాత పెన్షన్




పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని అసెంబ్లీలో ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని రెండు లక్షల సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల తరుపున కాంగ్రెస్ ప్రభుత్వానికి హృదయ పూర్వక ధన్యవాదాలు ఆయన తెలియచేశారు.

### ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ ప్రకటించడం హర్షణీయం: ట్రెసా

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. ఇచ్చిన మాట ప్రకారం యావత్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు లబ్ధి చేకూర్చే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

# మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తే కొత్త ప్రభుత్వానికి సహకరిస్తాం

### - అన్ని పోటీ పరీక్షలను ఉర్దూలో నిర్వహించాలి

### - అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తే కొత్త ప్రభుత్వానికి సహకరిస్తామని ఎంఐఎం ఎంఎల్ఎ అక్బరుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి తాము మద్దతిచ్చామని గుర్తు చేశారు. ఆయన ఆదరణ, ప్రేమ వల్ల తాము కాంగ్రెస్‌కు దగ్గరగా ఉన్నామని తెలిపారు. తాము ఏమైనా బాధలు చెప్పుకున్నా దానిని ఆయన ఆదరించి పరిష్కరించే వారు కాబట్టే తాము రాజశేఖర్ రెడ్డికి దగ్గరగా ఉన్నామన్నారు.ముస్లింల సమస్యల పరిష్కారం కోసం వైఎస్ఆర్‌తో ఎంతో కృషి చేశారన్నారు.రాజకీయాలు ఎన్నికల వరకే అని, గెలిచిన పార్టీ, ప్రతిపక్ష పార్టీలు ప్రజల కోసం పని చేయాలని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉర్దూ ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ముస్లింలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. కొత్త ప్రభుత్వం పాతబస్తీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని. ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉర్దూ ప్రస్తావన లేదన్నారు. డిఎస్‌సి మాత్రమే కాదు.. ఇతర పరీక్షలు ఉర్దూలో నిర్వహించాలన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే.. గెలిచిన పార్టీ, ప్రతిపక్ష పార్టీలు ప్రజల కోసం పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు.

### డిఎస్‌సి నోటిఫికేషన్ రెండు సార్లు ఇవ్వాలి

ఉర్దూను డిఎస్‌సిలో చేర్చాలని ఎంఐఎం అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. డిఎస్‌సిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు మాత్రమే ఉంటున్నారని, అందులో ఉర్దూని కూడా చేర్చాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉర్దూ రాదని, చట్టం ఎస్‌సి, ఎస్‌టిలకు పోస్టులు ఇవ్వమంటే డిఎస్‌సి నోటిఫికేషన్ రెండు సార్లు ఇవ్వాలని కోరారు. డిఎస్‌సి నోటిఫికేషన్ రెండు సార్లు ఇస్తే..ఉర్దూకు సంబంధించి భర్తీ కాని ఎస్‌సి,ఎస్‌టి, బిసి పోస్టులు భర్తీ అవుతాయని అన్నారు. పదోన్నతులు, డిపార్ట్‌మెంటల్ పరీక్షలతో సహా అన్ని పోటీలలో ఉర్దూను చేర్చాలని కోరారు. ఇది చాలా అవసరమని.. కానీ ఈ పని జరగడం లేదని పేర్కొన్నారు. అన్ని పోటీ పరీక్షలను ఉర్దూలో నిర్వహించాలని కోరారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా గెలిపించుకోలేకపోయారని అన్నారు. బిఆర్ఎస్ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ఇస్తుందా అని అడిగారు. కాంగ్రెస్ కులగణన చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న ప్రయత్నంను స్వాగతిస్తున్నామని తెలిపారు.





# అలిపిరి బాంబు దాడి కేసులో నిర్దోషులుగా ముగ్గురు నిందితులు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** చంద్రబాబుపై అలిపిరిలో జరిగిన బాంబు దాడి కేసులో ముగ్గురు నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ 4వ అదనపు జిల్లా తీర్పు వెల్లడించింది. ఈ కేసులో రామ్ మోహన్ రెడ్డి, నరసింహా రెడ్డి, చంద్ర అనే మాజీ నక్సలైట్‌ల ను దోషులుగా నిర్ధారిస్తూ 4 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ 2014లో కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై సవాల్ చేస్తూ నిందితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసులో వాదనలు కొనసాగుతూ వచ్చాయి. ఈ క్రమంలో శుక్రవారం ముగ్గురు ముద్దాయిలను నిర్ధోషులుగా కోర్టు తీర్పు వెలువరించింది.2003 అక్టోబర్‌లో సిఎం హెూదాలో తిరుమల స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళుతున్న చంద్రబాబుపై తిరుపతి సమీపంలోని అలిపిరి వద్ద బాంబు దాడి జరిగిన విషయం విదితమే.

# విద్యావ్యవస్థను పాతాళానికి నెట్టేసిన సీఎం జగన్‌రెడ్డి



**తెలంగాణ వీణ/అమరావతి :** విద్యాప్రమాణాలు గాలికి వదిలేసి.. విద్యావ్యవస్థను సీఎం జగన్‌రెడ్డి పాతాళానికి నెట్టేశాడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. శనివారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... "నాలుగున్నరేళ్లలో జగన్‌రెడ్డి రాష్ట్ర విద్యారంగంలో సాధించింది శూన్యం. నాడు–నేడు పేరుతో అవినీతికి పాల్పడి.. ఇంటర్ బోర్డుకి చెందిన కోట్లరూపాయలు కాజేసి బోర్డుని జగన్ నిర్వీర్యం చేశాడు. 60 వేల ఉపాధ్యాయ పోస్టుల్లో ఒక్క పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. ఉపాధ్యాయులకు ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని విస్మరించి.. వారిని మద్యం దుకాణాలవద్ద కాపలా పెట్టాడు. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లుగా తనపార్టీ...తనవర్గం వారిని నియమించి యూనివర్శిటీలను వైసీపీ కేంద్రాలుగా మార్చాడు. అంగన్ వాడీ కేంద్రాలకు అందించే చిక్కీల కొనుగోళ్లలో రూ.200కోట్లు.. 8వ తరగతి విద్యార్థులకు అందించే ట్యాబ్‌ల కొనుగోళ్లలో రూ.221కోట్లు కొట్టేశాడు. విద్యానాణ్యతా ప్రమాణాల్లో టీడీపీ ప్రభుత్వంలో దేశంలో 3వ స్థానంలో ఉన్న ఏపీ.. జగన్ హాయాంలో 19వ స్థానానికి పడిపోయింది. టీడీపీ ప్రభుత్వంలో పదోతరగతి ఉత్తీర్ణతాశాతం 92.9 శాతముంటే, జగన్ హాయాంలో అది 69.76కు పడిపోయింది. ఏపీలో 84లక్షల మంది విద్యార్థులుంటే కేవలం 44లక్షల మందికే అమ్మఒడి అందించి, మిగిలిన విద్యార్థులను విద్యకు దూరం చేశాడు. నాలుగేళ్లలో మూడేళ్లు అమ్మఒడి కింద రూ.25 వేల కోట్లు అందించి... నాన్నబుడ్డి ద్వారా లక్షకోట్లు పేదల నుంచి జగన్ కొట్టేశాడు" అని మహమ్మద్ షరీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లాడ్జిలో మహిళను చంపి ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**తెలంగాణ వీణ/ అమరావతి :** కర్నూలు జిల్లా ఉడ్‌లాండ్ లాడ్జిలో ఇద్దరు మృతి చెందడం కలకలం సృష్టిస్తుంది. లాడ్జి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించారు. చనిపోయిన వారిని నందికొట్కూర్‌కు చెందిన విజయ్(32), రుక్సానా(38) గా గుర్తించారు. రుక్సానాను హత్యచేసిన అనంతరం విజయ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.రుక్సానా(38)కు ముగ్గురు పిల్లలున్నారు. విజయ్ ఆత్మహత్య అనంతరం రుక్సానా పిల్లలకు ఫోన్‌చేసి సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధముందని, దర్యాప్తు చేస్తున్న పోలీసులు వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్ శంకరగిరి మాణ్యాలకు పోవాల్సిందే : ఏపీ మంత్రి అంబటి రాంబాబు



**తెలంగాణ వీణ/అమరావతి :** ఏపీలో జరుగబోయే ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్ తదితరులు శంకరగిరి మాణ్యాలకు పోవాల్సిందేనని ఏపీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపీలో సింగిల్‌గా పోటీ చేసే దమ్ము చంద్రబాబుకు లేక జనసేనతో కలిసి పోటీ చేస్తున్నారని ఆరోపించారు. ఏపీలో గెలుస్తానని నమ్మకం లేక పవన్ కల్యాణ్‌ను వెంట పెట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు.రెండు పార్టీలను చిత్తుగా ఓడించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని , 175 సీట్లు గెలుపొందాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ఆయన పేర్కొన్నారు. సొంత నియోజకవర్గంలో కాకుండా పక్కనున్న నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు, లోకేశ్‌ను ఆయన ప్రశ్నించారు.వైఎస్ జగన్ పాలనను చూసి ఏపీలో అధికారంలోకి రామని చంద్రబాబు భయపడుతున్నారని విమర్శించారు. లోకేశ్ చేపట్టిన యువగళం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వెల్లడించారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఏపీ సీఎం వైఎస్ జగన్ తగిన గుర్తింపునిచ్చారని తెలిపారు.

# తిరుపతి విమానాశ్రయంలోని శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పు



**తెలంగాణ వీణ/తిరుమల :** దేశ విదేశాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే విమాన ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్‌ను మార్పు చేశామని టీటీడీ అధికారులు వెల్లడించారు. తిరుపతి విమానాశ్రయంలో ప్రతి రోజు 100 ఆఫ్‌లైన్ శ్రీవాణి టికెట్లను టీటీడీ జారీ చేస్తున్న విషయం తెలిసిందే.విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల జారీకి అనుమతి లేని కారణంగా శనివారం నుంచి విమానాశ్రయంకు బదులుగా తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో ఆఫ్‌లైన్ టికెట్లను జారీ చేయడం ప్రారంభించామని వివరించారు. ప్రతి రోజు 100 టికెట్లను బోర్డింగ్ పాస్ సమర్పించిన భక్తులకు యథావిధిగా శ్రీవాణి దర్శన ఆఫ్‌లైన్ టికెట్లను అందజేస్తామన్నారు. భక్తులు విమానాశ్రయంలో శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ మార్పును గమనించాలని కోరారు.

# దుప్పటికి అంటుకున్న చలి మంటలు.. వృక్తి సజీవదహనం



**తెలంగాణ వీణ/విజయనగరం :** తెలుగు రాష్ట్రాలను చలి గజగజ వణికిస్తోంది. ఈ చలి నుంచి తట్టుకునేందుకు వృద్ధులు చలి మంటలను కాచుకుంటున్నారు. చలి మంటలు దుప్పటికి అంటుకోవడంతో ఓ వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. ఈ ఘటన విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని బొద్దాం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొద్దాం గ్రామంలో చలి విపరీతంగా ఉండటంతో, తట్టుకునేందుకు ఓ వృద్ధుడు పశువుల పాకలో చలి మంటలు పెట్టుకున్నాడు. పాకలో నిద్రిస్తున్న తిమ్మ నాగమయ్య(75) అనే వృద్ధుడి దుప్పటికి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆయన సజీవదహనం అయ్యాడు. అనారోగ్యంతో మంచం పట్టిన ఆయన.. చలి కాచుకునేందుకు పెట్టిన మంటలు దుప్పటికి అంటుకోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య సన్యాసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సీఎం జగన్ అనాలోచిత విధానాలతో ఇబ్బందుల్లో బెల్లం కార్మికులు



**తెలంగాణ వీణ/అనకాపల్లి జిల్లా:** సీఎం జగన్మోహన్‌రెడ్డి విధ్వంసక, అనాలోచిత విధానాల కారణంగా అనకాపల్లి బెల్లం మార్కెట్‌పై ఆధారపడిన వేలాది రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్నారని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. శనివారం నాడు లోకేష్‌ను అనకాపల్లి బెల్లం రైతులు, వ్యాపారులు కలిశారు. లోకేష్ సమక్షంలో అనకాపల్లి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు టీడీపీ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి నారా లోకేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ... "సైకో పాలనలో రాష్ట్రం ఏ ఒక్క వర్గానికి కంటినిండా కునుకు, కడుపునిండా భోజనం చేసే పరిస్థితి లేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్లం విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేసి అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గత వైభవం తెస్తాం. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం. అన్నదాత పథకం కింద ప్రతిరైతుకు ఏటా రూ.20వేల రూపాయల ఆర్థికసాయం అందిస్తాం" అని నారా లోకేష్ పేర్కొన్నారు.

# ఏపీలో పోలీసు వ్యవస్థ కనుమరుగు



**తెలంగాణ వీణ/అమరావతి:** రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల నుంచి పోలీసు వ్యవస్థ కనుమరుగై పోయిందని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండి రాకేష్ పేర్కొన్నారు. శనివారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, మహిళలు, టీడీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. ధైర్యంగా ఎదుర్కోలేక పిరికితనంగా దాడులు చేస్తున్నారు. మా టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గూడవల్లి నరసయ్య ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం. దాడి జరిగి ఒక రోజవుతున్నా పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాడికి పాల్పడిన వారిని వెంటనే పోలీసులు పట్టుకొని రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలి. పిరికి పనులు చేయటంలో జగన్ సిద్ధహస్తుడు.. పిల్లిలా ప్యాలెస్‌లో శాశ్వతంగా పాడుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయి" అని దూండి రాకేష్ హెచ్చరించారు.



# ఐదు రాష్ట్రాల్లో వికసిత్ భారత్ యాత్ర ఆరంభం

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను ప్రారంభించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరంలలో ఈ సంకల్ప్ యాత్రను ఏకకాలంలో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించారు. నిజానికి ఈ రాష్ట్రాలలో ఈ సంకల్ప్ యాత్ర ముందుగానే జరగాల్సి ఉంది. కానీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలుతో దీనిని వాయిదా వేశారు. ఇప్పుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ పలువురు లబ్ధిదారులతో ముచ్చటించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందుతున్న వారిని ఎంచుకుని వారి స్పందనను తెలుసుకున్నారు. దేశంలో ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమం వల్ల దేశంలోని మహిళలు తమను తాము నిలబెట్టుకున్నారని, అంతేకాకుండా ఇతరులకు కూడా తగు విధంగా ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. ఆత్మనిర్భర్ పథకం లబ్ధిదారుతో ఆయన ముచ్చటించారు. కష్టపడి పనిచేసేవారికి, అంకితభావపు వ్యక్తులకు తమ ప్రభుత్వం పలు విధాలుగా చేయూత అందిస్తుందని వివరించారు. ఈ దేశాన్ని 2047 నాటికి సంపన్న దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని మోడీ తెలిపారు. ఈ వీడియో అనుసంధాన కార్యక్రమంలో ఐదు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతిష్టాత్మక పథకాలను గురించి వివరించడమే ఈ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రధాన ఉద్దేశం. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలతో మరింతగా మమేకం కావడానికి బిజెపి ఈ విధంగా ఈ కార్యక్రమాన్ని ఎంచుకుందనే విమర్శలు తలెత్తుతున్నాయి. నిర్ణీత వర్గాలందరికి ప్రభుత్వం తరఫున ప్రయోజనాలు అందుతాయని ఈ దశలో మోడీ భరోసా కల్పించారు. ఇది సమయానుగుణంగా తగు రీతిలో జరిగే ప్రక్రియ అవుతుందని వివరించారు. ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్షలను తీర్చడం ద్వారానే మోడీ గ్యారంటీలు సార్థకం అవుతాయని స్పష్టం చేశారు. ఈ దిశలో తమ ప్రభుత్వం సకల విధాలుగా పాటుపడుతోందన్నారు.

### సామాన్యుడే మోడీకి విఐపి



దేశ సామాన్య ప్రజలందరిని ప్రధాని మోడీ తమ విఐపిగా భావిస్తుంటారని,ఈ క్రమంలో వారికి తగు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుంటారని సంకల్ప్ యాత్ర దశలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు. ప్రధాని ఆలోచనా దృక్పథంతో ఇప్పుడు ప్రతి ఒక్కరి పని అత్యంత వేగవంతంగా జరుగుతుందని చెప్పారు.

## కేరళలో కొత్త వేరియంట్ కలకలం..



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** దేశంలో మరోసారి కోవిడ్ కేసుల్లో పెరుగుదల కనపిస్తోంది. తాజాగా కేరళలో కొత్తగా కోవిడ్ సబ్‌వేరియంట్ వెలుగులోకి వచ్చింది. జేఎన్ .1 సబ్‌వేరియంట్‌ని కనుగొన్నారు.చైనాలో కేసులకు కారణమవుతున్న ఈ వేరియంట్‌ని తొలిసారిగా కేరళలో గుర్తించారు. జేఎన్.1 సబ్‌వేరియంట్, బిఏ .2.86 వేరియంట్‌గా కూడా పిలుస్తారు. మొదటిసారిగా సెప్టెంబర్ 2023లో అమెరికాలతో ఇది కనుగొనబడింది.ప్రస్తుతం ఈ కొత్త వేరియంట్ గుర్తించడంతో దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన పెరుగుతోంది. కోవిడ్-19 సబ్-వేరియంట్ జేఎన్.1 కేసు డిసెంబర్ 8న కేరళలో కనుగొనబడింది. 79 ఏళ్ల మహిళ శాంపిల్లను పరీక్షించగా ఈ కొత్త వేరియంట్ ఉన్నట్లు గుర్తించారు. ఈ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందడంతో పాటు మానవుడి రోగ నిరోధక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇంతకముందు సింగపూర్ దేశంలో ఒక భారతీయ టూరిస్ట్‌కి కూడా జేఎన్.1 సబ్-వేరియంట్ ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు తిరుచిరాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తిలో దీన్ని కనుగొన్నారు. ఆ తర్వాత దేశంలో మరెక్కడా కూడా ఈ వేరియంట్ కనిపించలేదు. తాజాగా కేరళలో వెలుగులోకి రావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది.కోవిడ్-19 వేరియంట్ బిఏ.2.86కి జేఎన్.1 సబ్ వేరియంట్. ఈ వేరియంట్ ద్వారా ఇప్పటి వరకు ఆస్పత్రిలో చేరడం, తీవ్రమైన అనారోగ్యానికి గురికాలేదని ఎన్‌కే అరోరా చెప్పారు. దాదాపుగా ఏడు నెలల అనంతరం భారత్‌లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు పాశ్చాత్య దేశాల్లో జేఎన్.1 వ్యాప్తి పెరుగుతోంది.

## 'ఆ డబ్బు అంతా నాది కాదు' ఎంపి ధీరజ్



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** ఒడిశాకు చెందిన డిస్టలరీ కంపెనీపై ఆదాయపు పన్ను శాఖా అధికారులు గత బుధవారం దాడులు చేశారు. ఈ కంపెనీని కాంగ్రెస్ ఎంపి ధీరజ్ సాహు కుటుంబం నిర్వహిస్తోంది.ఐటి దాడుల్లో పన్ను అధికారులు రూ. 350 కోట్లకుపైగా డబ్బును పట్టుకున్నారు. ఈ డబ్బుకు సంబంధించి పదిరోజుల తర్వాత ఎంపి ధీరజ్ సాహు స్పందించారు. 'ఐటి అధికారులు పట్టుకున్న డబ్బు మొత్తం మద్యం విక్రమాలకు సంబంధించిన డబ్బే.కానీ ఈ డబ్బుకు కాంగ్రెస్ పార్టీకి కానీ, ఇతర ఏ రాజకీయ పార్టీలకు కానీ సంబంధం లేదు. పట్టుకున్న డబ్బు అంతా నాది కాదు. నా కుటుంబ సభ్యులది, ఇతర సంబంధిత సంస్థలకు చెందినది. నేను నా అకౌంట్ వివరాల్ని ఐటి కంపెనీకి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.' అని ఆయన అన్నారు. కాగా, డిస్టిలరీ కంపెనీని ధీరజ్ సాహు కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన ఐటి అధికారులు దాడులు నిర్వహించినప్పుడే చెప్పారు. ఈ దాడుల్లో 176 బ్యాగుల్లో ఉన్న డబ్బును అధికారులు లెక్కించారు. మొత్తం రూ. 351 కోట్ల నగదు లెక్క తేలినట్లు ఐటి అధికారులు వెల్లడించారు. ధీరజ్ సాహు వద్ద అన్ని కోట్ల డబ్బు పట్టుబడడంపై బిజెపి నేతలు తీవ్రంగా విమర్శించిన సంగతి తెలిసిందే.

## రాజ్యసభలో ఆప్ పక్ష నేతగా రాఘవ్ చద్దా

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభలో తమ పార్టీ నాయకుడిగా సంజయ్ సింగ్ స్థానంలో రాఘవ్ చద్దాను నియమించింది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సంజయ్ సింగ్ అందుబాటులో లేని కారణంగా ఇప్పటినుంచి ఆయన స్థానంలో రాజ్యసభలో తమ పార్టీ నాయకుడిగా రాఘవ్ చద్దా ఉంటారని రాజ్యసభ చైర్మన్‌కు రాసిన లేఖలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలియజేసింది. లిక్కర్ పాలసీ కేసులో సంజయ్ సింగ్ ప్రస్తుతం జైల్లో ఉన్న విషయం తెలిసిందే. రాజ్యసభలో తమ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రాఘవ్ చద్దా నియామకానికి సంబంధించి ఆమ్ ఆప్‌నుంచి లేఖ అందినట్లు రాజ్యసభ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. దీన్ని అమలు చేయడం కోసం ఈ లేఖను రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు పంపించారు. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి మొత్తం 10 మంది ఎంపిలున్నారు. బిజెపి, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తర్వాత సభలో ఆమ్ ఆద్మీ పార్టీయే అతిపెద్ద పార్టీ.



## అమిత్ షా కేసులో రాహుల్ గాంధీకి సమన్లు



**తెలంగాణ వీణ/సుల్తాన్‌పూర్(యుపి):** కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ దాఖలైన కేసులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఇక్కడి ఎంపి-ఎమ్మెల్యే కోర్టు శనివారం సమన్లు జారీచేసింది. వచ్చే ఏడాది జనవరి 6న రాహుల్ గాంధీ కోర్టులో హాజరు కావాలని కోర్టు ఆదేశించినట్లు న్యాయవాది ఒకరు తెలిపారు. డిసెంబర్ 16(శనివారం) హాజరుకావాలని గతంలో కోర్టు ఆదేశించడగా రాహుల్ గాంధీ హాజరుకాలేదు. అమిత్ షాపై రాహుల్ గాంధీ కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బిజెపి నాయకుడు విజయ్ మిశ్రా 2018 ఆగస్టు 4న కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.డిసెంబర్ 16న రాహుల్ గాంధీ హాజరుకావాలని గతంలో సుల్తాన్‌పూర్‌కు చెందిన ఎంపి-ఎమ్మెల్యే కోర్టు సమన్లు జారీచేయగా ఆయన హాజరుకాలేదని మిశ్రా తరఫు న్యాయవాది సంతోష్ పాండే తెలిపారు. నవంబర్ 18న న్యాయమూర్తి యోగేష్ యాదవ్ వాదప్రతివాదనల తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ తదుపరి విచారణను నవంబర్ 27వ తేదీన నిర్ణయించారని, డిసెంబర్ 16న రాహుల్ గాంధీ హాజరుకావాలని సమన్లు జారీచేశారని పాండే తెలిపారు. ఒక సహకార బ్యాంకు మాజీ చైర్మన్ అయిన మిశ్రా హనుమాన్‌గంజ్‌లో నివసిస్తున్నారు.

## పార్లమెంట్ భద్రతపై సమీక్షకు ఉన్నతాధికార కమిటీ



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** పార్లమెంట్ భద్రతపై సమీక్షించడానికి ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం వెల్లడించారు. ఈ మేరకు ఎంపీలకు లేఖల ద్వారా తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని స్పీకర్ లేఖలో తెలిపారు. కమిటీ సమర్పించే నివేదికను పార్లమెంట్‌లో సభ్యులకు తెలియజేస్తామని స్పీకర్ వివరించారు. కేంద్రహెూం మంత్రి త్వశాఖ నియమించిన ఈ కమిటీతోపాటు తాను కూడా ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేశానని స్పీకర్ చెప్పారు. పార్లమెంట్ కాంప్లెక్సు భవన సముదాయంలో భద్రతకు సంబంధించి వివిధ అంశాలను సమీక్షిస్తుందని, సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తుందని తెలిపారు.

## సిపిఎస్‌పై కేంద్రం తన వైఖరి మార్చుకోవాలి

**- ఎఐఎఫ్‌టిఒ జాతీయ ఉపాధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి**




**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని'(సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఎఐఎఫ్‌టిఒ) ఉపాధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం తన విధానాన్ని మార్చుకోవాలని కోరారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరుగుతున్న ఎఐఎఫ్‌టిఒ జాతీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్ని ప్రసంగించారు.దేశంలో కొన్ని రాష్ట్రాలు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసినప్పటికీ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వబోమంటూ అనుసరిస్తున్న కేంద్ర వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. ఆయా రాష్ట్రాల వాటా, ఉద్యోగుల వాటా సొమ్మును తిరిగి వారి ఖాతాల్లో జమ చేయాలని శ్రీపాల్‌రెడ్డి కోరారు. ఈ అంశాలపై జాతీయస్థాయిలో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎఐఎఫ్‌టిఒ కార్యవర్గ సభ్యులు బి. గీత, త్రివేణిదేవి, రామేశ్వర్ గౌడ్, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ స్కామ్‌ల ఫలమే జార్ఖండ్ సొమ్ము: కేంద్ర మంత్రి ఠాకూర్



**తెలంగాణ వీణ/సిమ్లా :** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వివిధ స్కామ్‌లకు జార?ండ్ కాంగ్రెస్ ఎంపి అక్రమ లావాదేవీలకు విడదీయని బంధం ఉందని కేంద్ర సమాచార ప్రసారాల మంత్రి అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. మద్యం , బొగ్గు, వీటికి తోడుగా మహాదేవ్ బెట్టింగ్ యాప్ వంటి భారీ కుంభకోణాలకు జార?ండ్‌తో లింక్ ఉందని , కాంగ్రెస్ ఎంపి నివాసంలో దొరికిన రూ 353 కోట్ల నగదుకు , ఈ స్కామ్‌లకు అవినాభావ సంబంధం ఉందన్నారు. కాంగ్రెస్ అవినీతి పనులకు, దొరుకుతున్న నల్లధనం నిల్వలకు లింక్ ఉంది. ఇందుకు పలు ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నేతలు సర్వదా అక్రమ అవినీతి పనులకు దిగుతుంటారు. అందుకే వీరు నల్లధనం మూటలను కాపాడుకోవడానికి నానా విధాలుగా యత్నిస్తుంటారని మంత్రి విమర్శించారు. దేశంలో పెద్ద నోట్ల రద్దును కాంగ్రెస్ పెద్ద ఎత్తున వ్యతిరేకించింది ఇందుకే అని తెలిపారు.పైగా తమ అక్రమా లు ఎక్కడ బయటపడుతాయనే భయంతోనే కాంగ్రెస్ నేతలు తరచూ ఇడి, సిబిఐలపై మంటతో మాట్లాడుతుంటారని అన్నారు. బిలాస్‌పూర్‌లో కేంద్ర మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒడిషాకు చెందిన బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేటు లిమిటెడ్ జార?ండ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి ధీరజ్ సాహూ కుటుంబానిది. అక్కడ విపరీత స్థాయిలో నగదు, బంగారం దొరికిన విషయాన్ని గుర్తించాల్సి ఉందని ఠాకూర్ తెలిపారు. దేశంలో ఇంతకు ముందెప్పుడూ ఐటి దాడులలో ఇంత భారీ మొత్తం దొరకలేదని స్వయంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులే చెప్పిన విషయాన్ని ఈ దశలో కేంద్ర మంత్రి ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలిత కర్నాటకలో కూడా ఈ పార్టీ నేత నుంచి రూ 42 కోట్లు స్వాధీనపర్చుకున్నారని, అవినీతిపరుల కాంగ్రెస్ జాడలు ఐటి, ఇడి దాడులలో వెలుగులోకి వస్తున్నాయని విమర్శించారు.

## ఆర్టికల్ 370 రద్దును సమర్థించి తప్పు చేశారు

**తెలంగాణ వీణ/ముంబై:** గడిచిపోతున్న ఈ ఏడాది 2023లో పలు కలువరం కల్గించే పరిణామాలు చోటుచేసుకున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రోహింటన్ నారిమన్ అభిప్రాయపడ్డారు. ఈ కలవర కారక అంశాలలో సుప్రీంకోర్టు తీర్పులు కూడా కొన్ని ఉన్నాయని ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు, కొలీజియం వ్యవస్థ వంటి వాటిని ఆయన పేర్కొన్నారు. ముంబైలో ఆసియాటిక్ సొసైటీ సదస్సులో ఆయన కానిస్టూషన్ : చెక్ అండ్ బ్యాలెన్సెస్అనే అంశంపై ఉపన్యసించారు. 2023 సంవత్సరం గతించిపోతోంది. అయితే కలకాలం కలవరం కల్గించే ఘటనను వదిలివెళ్లుతోందన్నారు. పలు చేదు జ్ఞాపకాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు తీర్పులలో ప్రధానంగా ఆర్టికల్ 370 రద్దు సబబు అంశం, ఎన్నికల కమిషనర్ల నియామకాల బిల్లు ఆమోదం , జడ్జిల బదిలీలు, నియామకాల కొలిజియం వ్యవస్థ వ్యవహారాలు వంటివాటిని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. అన్నింటికంటే తనకు బాగా కలిచివేసింది ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు అని విశ్లేషించారు.నిజానికి సుప్రీంకోర్టు ఈ విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. దీనికి బదులుగా ఇందుకు విరుద్ధంగా ధర్మాసనం ఏకంగా రాజ్యాంగ వ్యతిరేక చర్యకు అనుమతిని ఇచ్చినట్లు అయిందని ఈ మాజీ న్యాయమూర్తి నిరసన వ్యక్తం చేశారు. ఓ వైపు మీరు ఈ ప్రధాన విషయంపై ఓ నిర్ణయానికి రాలేకపొయ్యారు. ఇదే దశలో పూర్తిగా ఓ వైపు ఇది సబబే అంటూ పరోక్షంగా నిర్ణయించేశారు. దీనితో ఓ రాజ్యాంగ వ్యతిరేక చర్య నిరవధిక స్థాయిలో సాగేందుకు అవకాశం కల్పించారని ఈ తీర్పు గురించి మాజీ న్యాయమూర్తి స్పందించారు. అదే విధంగా రాష్ట్రపతి పాలన సంబంధిత ఆర్టికల్ 356 (5)ని అధికారిక వ్యవస్థ ఉల్లంఘించింది. ఇవన్నీ కూడా మనోస్తానికి దారి తీసే విషయాలు అవుతాయని వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర స్థాయి హెూదా విషయంలో సొలిసిటర్ జనరల్ ఇచ్చిన హామీని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అయితే అప్పటి సొలిసిటర్ కల్పించిన హామీని పాటించే అవసరం ఏ విధంగా కూడా తరువాత వచ్చిన ప్రభుత్వానికి కానీ లెజిస్లేచర్‌కు కానీ లేదని దీనిని సుప్రీంకోర్టు తీర్పులో పట్టించుకోలేదని మాజీ న్యాయమూర్తి తెలిపారు.



# భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించాలి

**- జిల్లా వ్యాప్తంగా ప్రచార రథాల ద్వారా సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు**

**- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**

**తెలంగాణ వీణ/మేడ్చల్ కలెక్టరేట్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 16 నుండి జనవరి 26వ తేదీ వరకు నిర్వహించనున్న భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రచార రథాలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవనజ్యోతి భీమా యోజన వంటి పథకాలపై గ్రామాలలో ప్రజలకు అర్థమయ్యే విధంగా భారత్ వికసిత్ సంకల్పయాత్ర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రచారయాత్రను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామానికి ప్రచారరథం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆయా పథకాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అట్టడుగు వర్గాల స్థాయికి చేరుకోవాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారుల చెంతకు తీసుకువెళ్ళి వారికి పూర్తి స్థాయిలో తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా నూతన లబ్ధిదారుల గుర్తింపులో పూర్తి స్థాయిలో అందరికీ లబ్ధి చేకూరేలా అధికారులు తమ విధులు నిర్వహించాలని తెలిపారు. భారత ప్రభుత్వం పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, ఇళ్ళు, ఆహార భద్రత, పౌష్టికాహారం, విద్య, వైద్యం, విద్య, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అవగాహన కల్పించడంతో పాటు కొత్త లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా అవగాహన కల్పించేందుకుగాను ఈ



కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాకు ప్రచార రథాలు వచ్చాయని, వాటి ద్వారా జిల్లాలో నేటి నుంచి జనవరి 26వ తేదీ వరకు ప్రతి రోజు ఆయా మండలాల్లోని గ్రామాల్లోని, గ్రామపంచాయతీలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విధంగా వాహనం వారీగా రూట్ మ్యాప్, కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ వాహనాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశం ఆడియో వీడియోతో పాటుగా ఎల్ఈడీ స్క్రీన్స్ ద్వారా గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అవగాహన కల్పించడంతో పాటు ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే వారు నమోదు చేసుకునేలా ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి మండలానికి నోడల్ అధికారులను నియమించడంతో పాటు సంబంధిత శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై కరపత్రాలు, పుస్తకాలు ప్రజలకు అందజేసి ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. ప్రజలు ఈ క్యాంపులకు హాజరయ్యేలా గ్రామ కార్యదర్శులు గ్రామాలలో చాటింపు వేయాలని, కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు తీసి ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాల్సిందిగా సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు విజయవంతం చేసేందుకు సహకారం అందించాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించాలని, ఆయా పథకాలలో ఏ విధంగా లబ్ధి పొందుతున్నారు, ఏ విధమైన లాభం జరుగుతుందన్నదన్నది లబ్ధిదారుల వ్యక్తిగత అనుభవాలను అందరితో పంచుకునేలా చూడాలన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చి, కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. సంకల్ప్ యాత్ర విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఐటీ ప్లాట్ ఫామ్‌లలో ప్రీ ఈవెంట్ సమాచారాన్ని అప్లోడ్ చేయాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారులుగా జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, ఎల్డీఎమ్ శ్రీనివాసులు, జిల్లా సివిల్ సప్లయి అధికారిణి విజయలక్ష్మి,, డీపీవో రమణమూర్తి వ్యవహరిస్తారని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

# దద్దరిల్లిన తెలంగాణ అసెంబ్లీ...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో వాడివేడీగా చర్చ సాగుతోంది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో వాడివేడీగా చర్చ సాగుతోంది. కెటిఆర్, డిప్యూటీ సిఎం భట్టి మధ్య మాటల యుద్ధం సాగింది. దీనిని కలుగజేసుకొని సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. సభ్యుల సంఖ్య కాదు.. ప్రజాస్వామ్య స్ఫూర్తి ముఖ్యమని రేవంత్ అన్నారు. కెసిఆర్ కు రాజకీయ అవకాశం కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ వ్యాఖ్యానించారు. కెసిఆర్‌ను యూత్ అధ్యక్షుడు చేసింది కాంగ్రెస్సేనని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల మధ్య మాటల యుద్ధం నెలకొంది. 55 ఏండ్ల పాపాల పుట్ట కాంగ్రెస్ అని కేటీఆర్ అనగా, 10 ఏళ్ల విధ్వంస కాండ చేసింది బీఆర్ఎస్ అని విక్రమార్క అన్నారు.



అచ్చొచ్చిన ఆంబోతులలాగా వ్యవహరిస్తే ఎవరు భయపడరని సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఇరుపక్షాల సభ్యుల హాహాకారాలతో సభ దద్దరిల్లింది.అసెంబ్లీలో కేటీఆర్ వ్యాఖ్యలను ఉద్దేశించి.. కొంతమంది ఎన్ఆర్ఐలకు ప్రజాస్వామ్య స్ఫూర్తి తెలియదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నా రిప్లై గురించి బీఆర్ఎస్ తహతహలాడుతుందని వ్యాఖ్యానించారు. ఎంపీగా కేంద్రమంత్రిగా కేసీఆర్ కు అవకాశం కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్నారు. సభలో సంఖ్య ముఖ్యం కాదని ప్రజాస్వామ్య స్ఫూర్తి ముఖ్యమని అన్నారు.కెటిఆర్, డిప్యూటీ సిఎం భట్టి మధ్య మాటల యుద్ధం సాగింది. దీనిని కలుగజేసుకొని సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. సభ్యుల సంఖ్య కాదు.. ప్రజాస్వామ్య స్ఫూర్తి ముఖ్యమని రేవంత్ అన్నారు. కెసిఆర్ కు రాజకీయ అవకాశం కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ వ్యాఖ్యానించారు. కెసిఆర్ ను యూత్ అధ్యక్షుడు చేసింది కాంగ్రెస్సేనని అన్నారు.

## కుక్కలు కూడా వారి వెంట పడవు...

**- మా పార్టీ మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు - బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు**

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** 'వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదు.. కుక్కలు కూడా వారి వెంట పడవు'అని శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తీవ్ర వ్యా ఖ్యలు చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఉభయసభల సంయుక్త సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై శాసనసభ ఆవరణలో పిచ్చాపాటిగా మాట్లాడారు. 'తొక్కుడు రాజకీయాలతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైంది.అసలు విషయాలు అధిష్టానం వరకు చేరకుండా మధ్యలోనే కొందరు ఆపేశారు. జోకుడు బ్యాచ్‌కు మా పార్టీ అధిష్టానం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. వాస్తవాలు చెప్పేందుకు అధినేత అవకాశం ఇస్తే ఎవరైనా అసలు విషయం చెప్తారు. వాస్తవాలు చెప్పేవారు బయట, జోకుడుగాళ్లు లోపల ఉంటే వాస్తవాలు ఎలా తెలుస్తాయి. పార్టీ గెలుపుపై ఊహాగానాలు ఎక్కువై వాస్తవాలు మరిచిపోయారు. 2014, 2018 ఎన్నికల్లో ఇతర పార్టీల్లో గెలిచిన వారిని బీఆర్ఎస్‌లోకి లాగితే.. వచ్చిన వారు నిజమైన బీఆర్ఎస్ లీడర్లను అణచివేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతీసారి ఇతర పార్టీల్లో గెలిచిన వారిని బీఆర్ఎస్‌లోకి తెచ్చుకుంటే నేతలు గ్రూపులుగా విడిపో యారు. కొన్ని జిల్లాల్లో మా పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల్లో అసహనం పెరిగేలా చేశారు.. దానిని ఎలా మేనేజ్ చేయాలో పార్టీకి ప్రణాళిక లేకపోతే ఎలా గెలుస్తాం. ఆత్మగౌరవం ఎక్కువగా ఉండే వరంగల్ లాంటి జిల్లాల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ లాంటి వారికి మంత్రి పదవులు ఇస్తే ఉద్యమకారులు బాధపడ్డారు. తెలంగాణవాదం, ఉద్యమం గురించి తెలియని వారికి మంత్రి పదవులు ఇస్తే ఎలా.. పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమిని అక్కడి ఓటర్లు ఎప్పుడో నిర్ణయించారు. ఆయన జనాలకు చక్కిలిగింత పెట్టడం తప్ప ఎవరికీ రూపాయి సాయం చేయరు'అని రవీందర్‌రావు అన్నారు.

### ఆ ప్రచారాన్ని నమ్మొద్దు

చిట్‌చాట్ పేరిట తాను అనని మాటలను అన్నట్టు గా ప్రచారం జరుగుతోందని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. తాను వ్యాఖ్యలు చేసినట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను ఏదైనా విషయం మాట్లాడాలని అనుకుంటే అధికారికంగా మీడియా సమావేశం



ఏర్పాటు చేసి చెప్తానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌పై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఆయన అప్పజెప్పిన అనేక బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చినట్లు పేర్కొన్నారు. చిట్‌చాట్ పేరిట జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తక్కెళ్లపల్లి కోరారు

## సమక్క-సారక్క వర్సిటీలో 2,790 సీట్లు...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాష్ట్రంలో నూతనంగా నెలకొల్పనున్న సమక్క-సారక్క జాతీయ గిరిజన వర్సిటీలో రాబోయే ఏడేండ్లలో 2,790 యూజీ, పీజీ సీట్లు లభ్యమవుతాయని కేంద్ర విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. రూ.889.07 కోట్లతో ములుగు జిల్లాలో ఈ వర్సిటీ ఏర్పాటుకు ఇటీవలే పార్లమెంట్ ఆమోదం తెలిపింది. 11 డిపార్ట్మెంట్లతో ఏర్పాటయ్యే 5 స్కూళ్లలో వివిధ కోర్సులను నిర్వహిస్తారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులను నిర్వ హించనున్నారు. తొలుత తాత్కాలిక క్యాంపస్ లో ఈ వర్సిటీని ప్రారంభించనుండగా, నూతన వైస్ చాన్స్ లర్ ను కేంద్రం నియమించాల్సి ఉంటుంది. సీయూఈటీ (యూజీ), సీయూఈటీ (పీజీ) ప్రవేశ పరీక్షల ద్వారా ఈ వర్సిటీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తారు.

**గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు.. అసెంబ్లీలో చర్చ**

తెలంగాణ శాసనసభ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో ఇవాళ చర్చ జరుగుతోంది. శాసనసభలో ఈ తీర్మానాన్ని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రతిపాదించగా.. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బలపరిచారు. మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి బలపరిచారు. అంతకుముందు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పేరును సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. ధన్యవాద తీర్మానంపై చర్చ అనంతరం ఉభయసభలు వాయిదా పడనున్నాయి.

## సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష తేదీ మార్పు.. .. కొత్త షెడ్యూల్ ఇదే..

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సైనిక పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఇచ్చిన షెడ్యూల్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం(2024-25)లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ఈఈ 2024) దరఖాస్తులకు గడువు శనివారంతో ముగియనుండంతో ఆ గడువును పొడిగించారు. గతంలో 16 వరకు దరఖాస్తులకు గడువు ఉండగా.. దాన్ని డిసెంబర్ 20 వరకు ఎన్టీఏ పొడిగించింది. అలాగే, ఈ పరీక్ష తేదీని జనవరి 21 నుంచి జనవరి 28(ఆదివారం)కి మార్పు చేసింది. పరీక్ష ఫీజును డిసెంబర్ 20 రాత్రి 11.50గంటల వరకు చెల్లించవచ్చని తెలిపారు. దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే 22 నుంచి 24వ తేదీ వరకు సవరించుకొనేందుకు అవకాశం కల్పించారు. పూర్తి సమాచారం https://exams.nta.ac.in/aissee/లో తెలుసుకోవచ్చు.

## నల్లమలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తా..



**తెలంగాణ వీణ/నాగర్కర్నూల్:** అచ్చంపేట. అందరి సహకారంతో నల్లమల ప్రాంతాన్ని పర్యాటక రంగంలో అభివృద్ధి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం హాజీపూర్ చౌరస్తాలోని ఎమ్మెస్సార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అచ్చంపేటను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నల్లమల ప్రాంతంలో వ్యాపార రంగం దిన దినాభివృద్ధి చెందే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హెూటల్ యజమాని మఖ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో యువకుడు గల్లంతు

**తెలంగాణ వీణ/ములుగు :** ములుగు జిల్లాలోని మంగపేట మండలం లో విషాదం జరిగింది కమలాపురం గోదావరి నది ఇంటెక్ వెల్ సమీపంలో శుక్రవారం రాము (25) ఈతకు వెళ్ళగా ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో ఆచూకీ కోసం నాటు పడవ సహాయంతో గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## తెలంగాణ జిల్లాలలో 9 మంది కొత్త కలెక్టర్లకు పోస్టింగులు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో 9 మంది ఐఏఎస్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది.హన్మకొండ అడిషనల్ కలెక్టర్‌గా రాధికా గుప్తా,ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పి.శ్రీజ,నిర్మల్ అడిషనల్ కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్,రాజన్న సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా పి.గౌతమి,జనగామ అడిషనల్ కలెక్టర్‌గా పర్మర్ పింకేశ్‌కుమార్ లలిత్‌కుమార్, మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా లెనిన్ వత్సల్ తొప్పో, మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్‌గా శివేంద్ర ప్రతాప్,వనపర్తి అడిషనల్ కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్,జయశంకర్ భూపా లపల్లి అడిషనల్ కలెక్టర్‌గా కదిరవన్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చింది.

## మేడారం జాతర సమీక్ష సమావేశానికి విచ్చేస్తున్న మంత్రి సీతక్క



**తెలంగాణ వీణ/ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో మేడారం జాతర సమీక్ష సమావేశానికి విచ్చేస్తున్న పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు దనసరి సీతక్క గారి భద్రత ఏర్పాట్లను ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ స్థానిక డి.ఎస్.పి.తో మాట్లాడి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, బాదం ప్రవీణ్, ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, తాడ్వాయి మండలం అధ్యక్షులు బోల్లు దేవేందర్, బండి శ్రీను, సహకార సంఘ అధ్యక్షులు పులి సంపత్, అధ్యక్షులు జాలపు అనంత రెడ్డి, అర్రెం లచ్చుపటేల్, సహకార సంఘ పాలకవర్గ సభ్యులు యానాల సిద్ది రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి.ముజాఫర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## సీతక్క ఘనస్వాగతనికి కార్యకర్తలకు పులుపునిచ్చిన పైడాకుల అశోక్



**తెలంగాణ వీణ/ములుగు :** ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మాత్యులుగా నియమితులై, పదవి బాధ్యతలు చేపట్టి ఆదివారం ఉదయం 10:00 గంటకు మన ములుగు నియోజకవర్గానికి తొలిసారిగా వస్తున్న శుభ సందర్భముగా ములుగు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మహమ్మద్ గౌస్ పల్లి గ్రామం నుండి ఘనంగా స్వాగతం పలకాలని ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పులుపునిచ్చారు.

## నేడు భద్రాచలంలో మంత్రి తుమ్మల పర్యటన

**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా భద్రాచలం వద్ద రెండో వంతెన నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. తుమ్మల పర్యటనలో సంబంధిత అధికారులు పాల్గొననున్నారు.



### బైపాస్ రోడ్డు సమీపంలో

# భూకబ్జాలు జోర్దార్

**- కూల్చేసిన చుంచుపల్లి రెవెన్యూ అధికారులు**

**- భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 13, 14వ వార్డుల మధ్యలో ఉన్న ప్రభుత్వ భూములలో కొంతమంది ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఇట్టి విషయాన్ని కొందరు రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకోవడంతో వారు వెంటనే స్పందించి ప్రభుత్వ భూములలో కట్టిన చిన్నపాటి గదులను శనివారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేయడం జరిగింది. గతంలో కూడా ఇదే భూమిలో కొందరు నిర్మాణాలు చేపడితే కూల్చివేసిన విషయం తెలిసిందే. కోట్ల రూపాయల విలువ చేసే భూమి చుట్టూ ప్రభుత్వ అధికారులు ఫెన్సింగ్ వేసినప్పటికీ కొందరు కబ్జాదారులు సర్కార్ స్థలాలను ఆక్రమించడం విమర్శలకు తావిస్తోంది. ఈ కబ్జాదారుల వెనుక కొందరు ఎర్రజెండా పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్లు ప్రచారం జరగడం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ కోట్ల రూపాయలు విలువ చేసే స్థలానికి రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# భట్టికి అభినందనల పర్వం



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా అధికారిక నూతన భవనంలోకి ప్రవేశించిన తెలంగాణ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని వారికి అత్యంత సన్నిహితులైన మిత్రులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో శనివారం హైదరాబాదులోని నూతన భవనంలో కలిసి శాలువాలు గజమాలతో ఘనంగా సత్కరించి పూల బొకేలు సమర్పించి హృదయపూర్వక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. భట్టి విక్రమార్కకి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసిన వారిలో ఆచార్య డాక్టర్ మద్దెలతోపాటు భట్టికి నిజాం కళాశాల మిత్రులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు రిటైర్డ్ సింగరేణి జిఎం అందెల ఆనందరావు శృతిలయ ఆర్ట్స్ అకాడమీ అధినేత ప్రముఖ గాయనీమని గాన కోకిల ఆమని ఆదర్శ ఫౌండేషన్ అధినేత నిరంతర సామాజిక సేవా తత్పరులు కుసుమ భోగరాజు సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ కుమార్ తదితరులున్నారు.

# గబ్బు లేపుతున్న సెప్టిక్ ట్యాంకులు!

**- పొంగిపొర్లుతున్న మురుగునీరు - దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి**

**- అధ్వానంగా మారుతున్న ఆవరణం - పట్టించుకోని వైద్యాధికారులు**

**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ దవాఖానా ఆవరణలో మరుగుదొడ్లకు సంబంధించిన సెప్టిక్ ట్యాంకుల నుండి మురుగు నీరు పొంగిపొర్లుతుంది. బయటికి వస్తున్న మురుగు నీరు ఆవరణమంతా అద్వానంగా మారుస్తుంది. సెప్టిక్ ట్యాంకుల నుండి వచ్చే మురుగునీరు వల్ల దుర్వాసన రావడంతో ఇటు రోగులతో పాటుగా అటు వారు వెంట వచ్చే సహాయకులు సైతం బేజారవుతున్నారు. సమస్య కొద్ది రోజులుగా ఉన్నప్పటికీ వైద్యాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మురుగునీరు స్వాగతం పలకడంతో ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. కళ్ళ ముందు ప్రధాన సమస్య స్పష్టంగా కనబడుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పెద్ద ఆసుపత్రిలో పారిశుధ్యంపై పర్యవేక్షణ లేకపోవడం వల్లనే సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి మురుగునీరు బయటకు వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. మురుగు సమస్య తలనొప్పిగా మారకముందే వైద్య శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పరిష్కారం మార్గం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ట్రాఫిక్ బేకర్..జనం బేజార్!

**- రోడ్ల ప్రక్కనే ఆటోల నిలుపుదల - ఇబ్బంది పడుతున్న పాదాచారులు**

**- నివారణ చర్యలు శూన్యం - ప్రమాదకరంగా మూలమలుపు**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొంతమంది ఆటో నిర్వాహకులు తమ ఆటోలను రోడ్లపైనే నిలుపుదల చేయడంతో పాదాచారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లా నడిబొడ్డులో ఈ సమస్య ఉండడంతో ద్విచక్ర వాహనదారుల బేజారవుతున్నారు. బస్టాండ్ చౌరస్తాలోని ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పైలాన్ సర్కిల్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడున్న మూలమలుపు వద్ద చిరు వ్యాపారులకు సంబంధించిన తోపుడుబండ్లను నిలువ చేయడం వల్ల ద్విచక్ర వాహనదారులు అవస్థలు వర్ణాతీతం. బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ ముందున్న రహదారి పక్కనే ఆటో డ్రైవర్లు తమ ఆటలను ఇష్టారాజ్యంగా నిలుపుదల చేస్తూ ప్రజల అసౌకర్యానికి గురిచేయడం పట్ల పలువురు అసహన వ్యక్తం చేస్తున్నారు. ఆటోల ద్వారా జరుగుతున్న అసౌకర్యం రోజురోజుకు పెరుగుతుంది తప్ప తగ్గడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఈ బస్టాండ్ చౌరస్తా సర్కిల్లో ట్రాఫిక్ పోలీస్ సిస్టంను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం వల్ల ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు విమర్శలు వెలుఎత్తుతున్నాయి. ముఖ్యంగా క్రమబద్ధీకరణ పైలాన్ ఎదురుగా ఉన్న తోపుడుబండ్లను అక్కడ పెట్టకుండా తొలగించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా ఆటోలను నిలుపుదల జరగకుండా పోలీస్ అధికారులు పర్యవేక్షణ చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కంచర్ల చంద్రశేఖర్ రావు నియామకం రద్దు చేయాలి

**- జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలి**

**- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలని కంచర్ల చంద్రశేఖర్ రావు నియామకం రద్దు చేయాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం-2018 ప్రకారం జనాభా ప్రాతిపదికన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీకు రిజర్వ్ చేయబడిందన్నారు. ఇంతకాలం జడ్పీ చైర్ పర్సన్ గా ఉన్న కోరం కనకయ్య ప్రస్తుతం ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని ఏజెన్సీ ఏరియాలో ఎస్టీలకు రిజర్వ్ చేయబడ్డ చైర్ పర్సన్ పదవికి జనరల్ కేటగిరీకి చెందిన ప్రస్తుత జిల్లా వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ ను తాత్కాలికంగా జడ్పీ చైర్మన్ గా ఎంపిక చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని ఆదివాసీలకు దక్కిన రాజ్యాంగ హక్కులను ఆధిపత్య వర్గాలు తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం ప్రతి చోటా చేస్తున్నారని ఆరోపించారు. కావున రాష్ట్ర ఎన్నికల సంఘం ఏటువంటి కాలయాపన చేయకుండా తక్షణమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవికి ఎన్నికలు నిర్వహించి మరో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని జడ్పీ చైర్ పర్సన్ గా ఎంపిక చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని లేని పక్షంలో రాజ్యాంగబద్ధంగా చట్టప్రకారం ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి సిద్ధమని తెలిపారు.

# ముగిసిన జిల్లా స్థాయి గిరిజన క్రీడోత్సవాలు



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు భద్రాద్రి జిల్లా స్థాయి క్రీడా పోటీలు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని నందు ఈనెల14వ తేదీ నుండి 16వ తేదీ వరకు నిర్వహించడం జరిగింది. శనివారం క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతిక్ జైన్ హాజరై క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, అధికారులు చంద్రమోహన్, జహీరుద్దీన్, ఏ టి నరసింహారావు, రూపదేవి, తిరుమలరావు, గోపాలరావు, రమణయ్య, అలివేలు మంగతాయారు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, డాక్టర్ వీరనాయక్, బుగ్గ వెంకటేశ్వర్లు,

## ముంబై కెప్టెన్సీ మార్పుపై రోహిత్‌కు ముందే తెలుసా..? ఇది 'కుట్ర' కాదా..?



ముంబై ఇండియన్స్ సారథిగా హార్థిక్ పాండ్యాను ఎంపికచేయడంతో రోహిత్ శర్మ అభిమానులంతా ఆ జట్టు హిట్‌మ్యాన్‌కు వెన్నుపోటు పొడిచిందని, ఇది కుట్ర అని దుమ్మెత్తిపోస్తున్నారు. కానీ పాండ్యాకు ముంబై సారథ్య పగ్గాలు ఇవ్వడంపై రోహిత్‌కు ముందే తెలుసా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇందులో కుట్ర ఏమీ లేదని, హార్థిక్ సారథ్యంలో ఆడేందుకు రోహిత్ అంగీకరించాడని, అలా సమ్మతించిన తర్వాతే ముంబై ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్టోబర్ - నవంబర్‌లో స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ జరుగుతుండగానే రోహిత్‌కు ఈ విషయం గురించి ముంబై యాజమన్యం సమాచారం అందించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. గుజరాత్ టైటాన్స్ యాజమన్యంతో విభేదాల కారణంగా పాండ్యా ఆ జట్టు మారాడని వార్తలు వచ్చినా ముందుగా ముంబై ఇండియన్సే హార్థిక్ పాండ్యాను ట్రేడ్ ప్రక్రియలోకి రావాలని ఆహ్వానించినట్టు సమాచారం. ముంబై ఈ ప్రతిపాదన తీసుకురాగానే పాండ్యా.. తనకు జట్టు సారథ్య పగ్గాలు అప్పజెప్పితేనే అందుకు ఒప్పుకుంటానని కండీషన్ పెట్టాడని అందుకు ముంబై కూడా అంగీకరించినట్టు తెలుస్తోంది.

### కాంస్య పోరులోనూ

## భారత్‌కు తప్పని ఓటమి..



కౌలాలాంపూర్ (మలేషియా) వేదికగా జరుగుతున్న జూనియర్ హాకీ వరల్డ్ కప్ - 2023లో ఫైనల్ చేరడంలో విఫలమైన యువ భారత జట్టుకు తాజాగా కాంస్య పోరులో కూడా పరాభవం తప్పలేదు. మూడో స్థానం కోసం శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్‌ను.. 1-3 గోల్స్ తేడాతో స్పెయిన్ ఓడించింది. స్పెయిన్ నుంచి నికోలస్ అల్వారెజ్.. 25వ, 51వ నిమిషంలో గోల్స్ కొట్టగా పెచామె పా 40వ నిమిషంలో గోల్ చేశాడు. భారత్ తరఫున సునీల్ జొజొ 28వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించాడు. ఈ టోర్నీలో స్పెయిన్‌పై భారత్‌కు ఇది రెండో ఓటమి. పూల్ స్టేజ్ లో కూడా భారత్.. స్పెయిన్ చేతిలో 4-1 తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. తాజా ఓటమితో భారత్ ఈ టోర్నీలో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. 2021లో జరిగిన ఎడిషన్‌లో కూడా భారత్.. నాలుగో స్థానంతోనే తృప్తి పడగా ఇప్పుడూ మన ర్యాంకు మారలేదు.రెండ్రోజుల క్రితం జరిగిన సెమీస్ మ్యాచ్‌లో భారత్ 1-4తో జర్మనీ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. 2016లో లక్నో వేదికగా జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తర్వాత భారత్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకోలేదు. ఈ టోర్నీలో జర్మనీ - ఫ్రాన్స్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

### క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు



అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో భారత మహిళల జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా భారీ విజయం నమోదు చేసిన జట్టుగా భారత్ రికార్డులకెక్కింది. ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టులో 347 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్, ఈ వరల్డ్ రికార్డును తమ పేరిట లిఖించుకుంది. ఇప్పటివరకు ఈ అరుదైన రికార్డు శ్రీలంక మహిళల జట్టు పేరిట ఉండేది.

## అమెరికా క్రికెట్ ఫ్యాన్స్‌కు ఈసారి డబుల్ ధమాకా..

## ఆ టోర్నీ ముగిసిన వెంటనే 'ఎంఎల్‌సీ'కి శ్రీకారం



అగ్రరాజ్యం అమెరికా క్రికెట్ అభిమానులను శుభవార్త. వచ్చే ఏడాది ఆ దేశంలో ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా దక్కనుంది. 2024లో వెస్టిండీస్‌తో పాటు అమెరికా కూడా టీ20 వరల్డ్ కప్‌కు ఆతిథ్యమివ్వనున్న విషయం తెలిసిందే. అయితే ఈ మెగా టోర్నీ ముగిసిన వెంటనే అక్కడ మినీ ఐపీఎల్ అయిన మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)కూడా మొదలుకానుంది. వచ్చే ఏడాది జులై 4 నుంచి ఎంఎల్‌సీ మొదలవుతుందని నిర్వాహకులు ప్రకటించారు.అధికారికంగా షెడ్యూల్ ప్రకటించకపోయినప్పటికీ టీ20 వరల్డ్ కప్ జూన్‌లో జరిగే అవకాశాలున్నాయి. ఇది ముగిసిన వెంటనే ఎంఎల్‌సీ మొదలుకానుంది. జులై 4 న ఎంఎల్‌సీ సెకండ్ సీజన్‌ను మొదలుపెట్టనున్నది. అమెరికా ఇండిపెండెన్స్ డే కూడా అదేరోజు కావడం గమనార్హం. గత సీజన్ కంటే వచ్చే ఏడాది ఈ టోర్నీ ఇంకా సక్సెస్ అవుతందని, మరింత మంది అంతర్జాతీయ స్టార్స్ ఈ లీగ్ లో భాగమవుతారని ఎంఎల్‌సీ టోర్నమెంట్ డైరెక్టర్ జస్టిన్ గేల్ తెలిపారు. 2024 సీజన్‌ను డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్నారని ఆయన చెప్పారు. గత సీజన్‌లో ఆటగాళ్ల అందుబాటు ప్రధాన సమస్యగా ఉండటంతో 15 రోజుల్లోనే టోర్నీ ముగిసింది.

### పొట్టి ప్రపంచకప్‌లో దాయాదుల పోరు..

## మ్యాచ్ జరిగేది ఇక్కడే..!



ఆట ఏదైనా సరే.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. భారత గడ్డపై ఈ మధ్యే ముగిసిన వన్డే వరల్డ్ కప్‌లో చిరకాల ప్రత్యర్థుల పోరాటాన్ని కోట్లాది మంది వీక్షించారు. మళ్లీ దాయాదుల సమరాన్ని ఎప్పుడు చూస్తామా? అని ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్‌న్యూస్. పొట్టి ప్రపంచ కప్‌లో మరోసారి టీమిండియా, పాక్ జట్లు తలపడనున్నాయి.వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో.. న్యూయార్క్ సిటీలోని పాపవ్ స్టేడియం వేదికగా భారత్, పాక్ ఢీకొననున్నాయి. 34 వేల మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా ఈ మ్యాచ్‌ను వీక్షించనున్నారు. న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో పాటు పాక్ దేశీయులు భారీ సంఖ్యలో నివసిస్తారు. దాంతో, ఐసీసీ దాయాదుల పోరును ఈ పట్టణంలో నిర్వహించేందుకు ప్లాన్ చేస్తుందని టాక్. అయితే.. భారత్, పాక్ మ్యాచ్ వేదికను ఐసీసీ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.వచ్చే ఏడాది జూన్‌లో టీ20 వరల్డ్ కప్ జరుగనుంది. అమెరికా, వెస్టిండీస్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో 20 జట్లు టైటిల్ వేటలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈసారి వరల్డ్ కప్‌లో ఉగాండా, పపువా న్యూ గినియా వంటి చిన్న జట్లు పోటీ పడుతున్నాయి. నిరుడు విజేతగా నిలిచిన ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఆరంభ ఎడిషన్ 2007లో ట్రోఫీని కొల్లగొట్టిన భారత్ మరోసారి పొట్టి ప్రపంచ కప్‌ను ఒడిసిపట్టాలనే కసితో ఉంది.

## రోహిత్ కెప్టెన్సీ తొలగింపు ఎఫెక్ట్..

## ఆ విషయంలో ముంబైని అధిగమించిన చెన్నై



ముంబై ఇండియన్స్ సారథిగా రోహిత్ శర్మను తప్పించి హార్థిక్ పాండ్యాను నియమించిన వెంటనే ఆ జట్టుపై హిట్‌మ్యాన్ అభిమానుల ఆగ్రహానికి ముంబైకి షాకులు తప్పలేదు. రోహిత్ అభిమానులు ముంబై ఇండియన్స్ ఫ్లాగ్‌ను తగులబెట్టడం, ఆ జట్టు యాజమాన్యాన్ని దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఫ్యాన్స్ ఆగ్రహంతో ముంబైకి మరో షాక్ తప్పలేదు. రోహిత్ ఫ్యాన్స్ దెబ్బకు ఇన్నాళ్లూ ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక మంది ఫాలో అయ్యే ఐపీఎల్ టీమ్‌గా ఉన్న ముంబై ఇండియన్స్‌ను చెన్నై సూపర్ కింగ్స్ అధిగమించింది.

### ముగిసిన మూడో రోజు ఆట..

## కంగారూలకు భారీ ఆధిక్యం..



ఆస్ట్రేలియా - పాకిస్తాన్ మధ్య పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆసీస్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా.. 2 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. తద్వారా ఆ జట్టు 300 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్‌ను 271 పరుగులకే ఆలౌట్ చేయడంతో ఆసీస్‌కు 216 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది.132-2 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద మూడో రోజు ఆట ఆరంభించిన పాకిస్తాన్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఖుర్రమ్ షాజాద్ (7) పరుగులేమీ జతచేయకుండానే ఔట్ అయ్యాడు. పాకిస్తాన్ భారీ ఆశలు పెట్టుకున్న బాబర్ ఆజమ్ (21)ను మిచెల్ మార్ష్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత పాకిస్తాన్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. అర్థ సెంచరీ చేసిన ఇమామ్ ఉల్ హక్ (62)ను స్పిన్నర్ నాథన్ లియాన్ బౌలింగ్‌లో కీపర్ అలెక్స్ కేరీ స్టంపౌట్ చేయగా.. మిడిలార్డర్ బ్యాటర్ సౌద్ షకీల్ (28), వికెట్ కీపర్ సర్ఫరాజ్ అహ్మద్ (3) కూడా విఫలమయ్యారు. ఆ తర్వాత వచ్చిన వారిలో అఘా సల్మాన్ (28 నాటౌట్) ఫర్వాలేదనిపించగా.. ఫహీమ్ అష్రఫ్ (9), అమీర్ జమాల్ (10), షహీన్ షా అఫ్రిది (4)లూ ఇలా వచ్చి అలా వెళ్లారు.

## ఒడిషా మాస్టర్స్ సింగిల్స్ టైటిల్ భారత్‌దే..

## ఫైనల్స్‌కు చేరిన అయూష్-సతీష్



కటక్ వేదికగా జరుగుతున్న ఒడిషా మాస్టర్స్‌లో భాగంగా పురుషుల సింగిల్స్ టైటిల్ భారత్‌కే దక్కనుంది. సెమీఫైనల్స్‌లో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు అయూష్ శెట్టి, సతీష్ కుమార్ కరుణాకరన్‌లు తమ ప్రత్యర్థులను ఓడించి తుదిపోరుకు అర్హత సాధించారు. వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత అయూష్ శెట్టి.. శనివారం ముగిసిన పురుషుల సింగిల్స్‌లో 19-21, 21-14, 22-20 తేడాతో ఇండోనేషియాకు చెందిన అల్వి ఫర్హన్ ను ఓడించాడు. ఇదివరకే ముగిసిన పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్స్‌లో సతీష్ కుమార్.. ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. సెమీస్‌లో సతీష్.. భారత్‌కే చెందిన కిరణ్ జార్జ్‌ను ఓడించి ఫైనల్ చేరాడు. 18 ఏండ్ల అయూష్‌కు అంతర్జాతీయ కెరీర్‌లో ఇదే తొలి సూపర్ 100 ఫైనల్. శనివారం అల్వితో జరిగిన పోరులో తొలి సెట్ ఓడినా రెండో సెట్‌లో పుంజుకున్న అయుష్ ఆ సెట్‌ను గెలుచుకున్నాడు. ఇక చివరి సెట్ హోరాహోరిగా సాగింది. అయుష్ ఫైనల్ చేరడంతో ఇరువురిలో ఎవరు గెలిచినా పురుషుల సింగిల్స్‌లో టైటిల్ మాత్రం భారత్‌కే దక్కనుంది.

## తూచ్..! అది ఈ చేతన్ కాదు..

## బీసీసీఐ యూటర్న్..



అనుమానిత బౌలింగ్ యాక్షన్ కలిగి ఉన్నాడంటూ టీమిండియా యువ బౌలర్, ఐపీఎల్‌లో గత సీజన్ వరకూ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం వహించిన చేతన్ సకారియాను బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన బీసీసీఐ.. 24 గంటలు ముగియకముందే యూటర్న్ తీసుకుంది. చేతన్ సకారియా అనుమానిత బౌలింగ్ యాక్షన్ జాబితాలో సకారియా లేడని, సమాచార లోపం వల్ల ఇలా జరిగిందని వివరణ ఇచ్చింది. బీసీసీఐ జాబితాలో చేర్చింది కర్నాటక బౌలర్‌ను అని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయదేవ్ షా తెలిపారు.ఇదే విషయమై జయదేవ్ షా మాట్లాడుతూ.. 'సమాచార లోపం వల్ల ఇలా జరిగింది. అనుమానిత యాక్షన్ కలిగి ఉన్న బౌలర్ల జాబితాలో చేతన్ లేడు. అది కర్నాటకకు చెందిన మరో బౌలర్. ఇదే విషయాన్ని మేం ఐపీఎల్ ఫ్రాంచైజీలకు అందజేశాం..' అని అన్నారు. సకారియా ఇప్పటివరకూ ఐపీఎల్‌లో 19 మ్యాచ్‌లు ఆడి 20 వికెట్లు పడగొట్టాడు. భారత జట్టు తరఫున ఒక వన్డే, రెండు టీ20లు ఆడాడు.చేతన్ సకారియాను ఈ ఏడాది రిటెన్షన్ ప్రక్రియలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని వేలానికి వదిలేసింది. అతడు త్వరలో దుబాయ్ వేదికగా ఈనెల 19న జరగాల్సి ఉన్న ఐపీఎల్ వేలంలో రూ. 50 లక్షల బేస్ ప్రైస్‌తో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. బీసీసీఐ శుక్రవారం విడుదల చేసిన జాబితాలో తనుష్ కోటియన్ (ముంబై), రోహన్ కన్నుమ్మల్ (కేరళ), చిరాగ్ గాంధీ (గుజరాత్), సౌరభ్ దూబే (విదర్భ), అర్పిత్ గులేరియా (హిమాచల్ ప్రదేశ్)లు ఉన్నారు. వీరి బౌలింగ్ యాక్షన్‌పై అనుమానాలు ఉన్నా బౌలింగ్ చేయకుండా నిషేధం విధించలేదు.





## హాట్ పిక్స్ తో సోషల్ మీడియాలో అరియానా రచ్చ..



హాట్ హాట్ ఫోటోలతో సోషల్ మీడియాలో కుర్రకారులకు పిచ్చెక్కిస్తోంది బిగ్ బాస్ ఫేం అరియానా. తాజాగా ఈ అమ్మడు తన హాట్ పిక్స్ తోపాటు బోల్డ్ కామెంట్ చేసింది. స్టైలిష్ గా కనిపిస్తూ బ్యాడ్ గర్ల్ గా ఉండేందుకు తాను బాధపడనని అంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం అరియానా బోల్డ్ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 'రాక్షస రాజా'గా రానా

పవర్‌హౌస్ యాక్టర్ రానా, క్రియేటివ్ డైరెక్టర్ తేజ కాంబినేషన్‌లో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత 'రాక్షస రాజా'తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇదివరకూ ఎన్నడూ చూడని క్రైమ్ వరల్డ్‌ని ఎక్స్‌ప్లోర్ చేస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా అద్భుతమైన సమ్మేళనంగా ఈ సినిమా ఉండనుంది. రానా పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్‌ను పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఇందులో రానా తన భుజంపై భారీ తుపాకీని పట్టుకుని మరో భుజంపై బుల్లెట్లతో కనిపించారు. విభూతి, తిలకం ధరించి, నోటిలో సిగార్‌తో వైల్డ్‌గా కనిపించారు. వేళ్లకు రెండు పొడవాటి బంగారు ఉంగరాలు ఉన్నాయి. ఓవరాల్‌గా రానా లుక్ అద్భుతంగా అలరిస్తోంది. ఈ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో మునుపెన్నడూ లేని విధంగా సినిమాటిక్ జర్నీని ప్రేక్షకులు ఆశించవచ్చు.



## 'బబుల్‌గమ్' పెద్దగా పేలుతుంది..(ట్రైలర్ లాంచ్)

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యంగ్ హీరో రోషన్ కనకాల తొలి చిత్రం 'బబుల్‌గమ్' టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బబుల్‌గమ్ థియేట్రికల్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, హీరో రానా దగ్గుబాటి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ట్రైలర్ లాంచ్ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. "బబుల్‌గమ్ ట్రైలర్‌లో సూపర్ హిట్ కళ కనిపిస్తోంది. బబుల్‌గమ్ మెల్లగా ఉబ్బి ఉబ్బి పెద్దగా పేలుతుంది. ఈ సినిమా టాక్ కూడా మెల్లగా ప్రారంభమై సూపర్ హిట్ టాక్ తో ముగుస్తుంది. రోషన్, మానస కెమిస్ట్రీ చాలా బావుంది"అని అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "బబుల్‌గమ్ సినిమాలో యూత్‌కు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ వున్నాయి. రోషన్ చాలా యూనిక్‌గా వున్నాడు. తన పర్ఫార్మెన్స్ విలక్షణంగా ఉంది" అని పేర్కొన్నారు. దర్శకుడు రవికాంత్ పెరేపు మాట్లాడుతూ.. "ట్రైలర్ కంటే సినిమా ఇరవై రెట్లు ఎక్కువగా అద్భుతంగా ఉంటుంది. సినిమా అందరికీ క్రేజీక్రేజీగా నచ్చుతుంది. రోషన్, మానస చాలా అద్భుతంగా నటించారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోషన్, మానస చౌదరి, సుమ, రాజీవ్ కనకాల, వివేక్ కూచిభొట్ల, శ్రీచరణ్ పాకాల తదితరులు పాల్గొన్నారు.






## రూమర్స్‌కు చెక్!



బాలీవుడ్‌లో అన్యోన్య దంపతులుగా పేరు తెచ్చుకున్నారు అభిషేక్ బచ్చన్-ఐశ్వర్యరాయ్. దాదాపు 17 ఏండ్ల సుదీర్ఘ వైవాహిక బంధంలో వీరి మధ్య విభేదాలు తలెత్తిన దాఖలాలు లేవు. అయితే ఈ జంట విడిపోనున్నారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం అమితాబ్‌బచ్చన్ 'అంతా అయిపోయింది' అనే అర్థం వచ్చేలా చేసిన ట్వీట్ అభిషేక్ బచ్చన్ దంపతులు విడాకుల రూమర్స్‌కు ఆజ్యం పోసింది. ఐశ్వర్యరాయ్ సోషల్ మీడియా ఖాతాలను అమితాబ్ అన్‌ఫాలో చేశారని మీడియాలో కథనాలొచ్చాయి. ఈ నేపథ్యంలో అభిషేక్-ఐశ్వర్యరాయ్ విడాకులు తీసుకోబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ రూమర్స్ అన్నింటికి తన తాజా వీడియోతో చెక్ పెట్టింది ఐశ్వర్యరాయ్. ముంబయిలో జరిగిన ఓ స్కూల్ వార్షికోత్సవ వేడుకలో అమితాబ్‌బచ్చన్, అభిషేక్, ఐశ్వర్యరాయ్ కలిసి పాల్గొన్నారు. ముగ్గురూ సరదాగా నవ్వుతూ కనిపించారు. ఇదే ఈవెంట్‌లో అమితాబ్‌బచ్చన్ ఫ్యామిలీ అంతా కలిసి స్టేజీ మీద నృత్యం చేశారు. దీంతో విడాకుల రూమర్స్‌కు చెక్ పడినట్లయిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## అక్కడ సక్సెస్ గురించి ఆలోచించరు



'ఊహలు గుసగుసలాడే'తో హీరోయిన్‌గా పరిచయమై 'జిల్'తో కమర్షియల్ హీరోయిన్‌గా ఎదిగి టాలీవుడ్ క్రేజీ హీరోయిన్స్‌లో ఒకరిగా ఎదిగింది రాశీఖన్నా. అయితే, ఈ మధ్య తాను నటించిన సినిమాలు పెద్దగా ఆడకపోవడం వల్లే అనుకుంట.. తమిళబాట పట్టిందీ ఢిల్లీ బ్యూటీ. అక్కడ అవకాశాలను బాగానే రాబట్టుకుంటున్నది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో ఓ మూడ్నాలుగు తమిళ సినిమాలున్నాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ పరిశ్రమపై ఆసక్తికరంగా మాట్లాడింది రాశీఖన్నా ' 'తమిళ పరిశ్రమలో ఫస్ట్ ప్రయారిటీ టాలెంట్‌కి ఇస్తారు. సెకండ్ ప్రయారిటీ అందానికిస్తారు. కేరక్టర్‌కి కరెక్ట్ అనుకుంటే సక్సెస్ గురించి కూడా ఆలోచించరు. దేశంలోని మిగతా పరిశ్రమలతో పోలిస్తే ఇది చాలా భిన్నమైన పరిశ్రమ అని చెప్పాలి. నాకు లైఫ్ ఇచ్చింది తెలుగు సినిమా అయితే, నటిగా నా ఆకలి తీరుస్తుంది మాత్రం తమిళ సినిమానే. ఇక్కడ మంచి పాత్రలు దొరుకుతున్నాయి.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది రాశీఖన్నా.

## రొమాంటిక్ హనీమూన్

'దర్శకుడు బాల మా అన్నపూర్ణ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కి డీన్. హాలీవుడ్ సినీనిర్మాణ పరిజ్ఞానాన్ని మా విద్యార్థులకు పంచి ఇవ్వడమేకాక, మా విద్యార్థులకు, అధ్యాపకులకూ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రంలో అవకాశాలు ఇచ్చాడు. వినోదంతోపాటు ఈ కథలో చక్కని సందేశంకూడా ఉంటుంది. కల్యాణీమాలిక్ రొమాంటిక్ సంగీతాన్నిచ్చాడు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి' అని అక్కినేని నాగార్జున అన్నారు. చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా రూపొందిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాలరాజశేఖరుని దర్శకుడు. కె.కె.ఆర్, బాలరాజ్ నిర్మాతలు. ఈ చిత్రం తొలి పోస్టర్‌ని అగ్రహీరో అక్కినేని నాగార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాలీవుడ్‌లో పనిచేసిన తనకు తెలుగు సినిమా చేయడం కల అని, నాగార్జున దంపతుల ప్రోద్బలంతో తెలుగు సినిమా చేయగలిగానని దర్శకుడు చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. తనికెళ్లభరణి, సుహాసిని, అలీ, సురేఖవాణి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: ఆర్.పి.పట్నాయక్, కెమెరా: శిష్టా వి.ఎం.కె.



## రిపోర్టర్లు కావలెను

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
69 TV తెలుగు

తెలుగు లో రాయగల సమర్ధత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక

అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.

వివరాల కొరకు సంప్రదించల్సిన ఫోన్ నెంబర్ లు
91 90525 22626
91 98485 99616

email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/

Published and Printed by Vulloju Srinivas on Behalf of Sri Veena Publications Printed at Telangana Veena Flat N0: 204 Mythri Apartments,Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB ACT, Phone number: 040 35668720,RNI Reg N0.TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written